# చిన్న కుటుంబం చింతలేని కుటుంబం

**న్యూఢిల్లీ :** దేశంలో జనాభా పెరుగుదల సమస్య చాలా పాతది. కానీ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తన ప్రసంగంలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. దీంతో ఇది మరోసారి ప్రధాన వార్తల్లో నిలిచింది. అంతేకాదు, మైనార్టీలను వేలెత్తిచూపటానికి ప్రధాని ప్రకటన కొంతమంది రాజకీయ నాయకులకు మరోసారి ఆజ్యం పోసింది. ముస్లిం జనాభా వేగంగా పెరుగుతున్నదనీ, అది త్వరలో హిందూ జనాభాను మించిపోతుందనే కథనాలు వ్యాప్తిచేయటానికి వారికి మరో అవకాశాన్నిచ్చింది. హిందూ మహిళలు కనీసం నలుగురు పిల్లలను కనాలని కూడా గతంలో బీజేపీకి చెందిన కొందరు నాయకులు ప్రకటనలు ఇచ్చిన సందర్భాలూ లేకపోలేదు. అసలింతకీ వాస్తవమేంటీ ?

**తగ్గుతున్న సంతానోత్పత్తి**

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. 'మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్)' అంటే.. జీవితకాలంలో ఒక మహిళలకు పుట్టే మొత్తం పిల్లల సంఖ్య'. భారతదేశంలో.. సంతానోత్పత్తి రేటు అన్ని వర్గాల్లో తగ్గుతున్నది. ఎన్ఎఫ్‌హెచ్ఎస్-1 (1992-93)లో ముస్లిం మహిళల్లో టిఎఫ్ఆర్ 4.4 కాగా, ఎన్ఎఫ్‌హెచ్ఎస్-4 (2015-16)లో ఇది 2.6కు తగ్గింది. ఇది ఇప్పటికీ హిందూ మహిళల కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ.. హిందూ-ముస్లింలో టీఎఫ్ఆర్‌ల మధ్య అంతరం గత రెండు దశాబ్దాల్లో బాగా తగ్గింది. 1992-93లో హిందూ-ముస్లింల టీఎఫ్ఆర్ మధ్య వ్యత్యాసం 1.1. అంటే ముస్లిం మహిళలకు హిందూ మహిళల కంటే 33శాతం ఎక్కువగా పిల్లలు పుట్టే అవకాశం ఉంది. ఇది 2015-16లో 0.5 మంది పిల్లలకు తగ్గింది. అంటే.. హిందూ మహిళల కంటే ముస్లిం మహిళలకు 23.8శాతం ఎక్కువగా పిల్లలకు జన్మనిచ్చే అవకాశం ఉంది.

**మొదటిసారి తల్లులవుతున్న వారి వయస్సు**

ఒక మహిళ తన మొదటి బిడ్డకు జన్మించే వయస్సు ఆలస్యం చేయడం, పిల్లల జననాల మధ్య అంతరాన్ని పెంచడం చాలా దేశాలలో సంతానోత్పత్తి రేటును తగ్గించడంలో సహాయపడింది. ఈ విషయం మనదేశానికి వర్తిస్తున్నది. 1992-93 గణాంకాలను పరిశీలిస్తే..



మొదటిసారిగా తల్లి అయిన సగటు మహిళ వయస్సు హిందూ మహిళల్లో 19.4 ఏండ్లు కాగా, ముస్లిం మహిళల్లో అది 18.7 ఏండ్లు. 2015-16 నాటికి ఇది హిందూ మహిళల్లో 21, ముస్లిం మహిళల్లో 20.6కు చేరింది. అంతేకాదు, రెండు వర్గాల్లోనూ వరుస జననాల మధ్య అంతరం పెరిగింది. ముస్లిం మహిళల్లోనూ ఈ అంతరంలో చాలా మార్పు వచ్చింది. అలాగే ఒక బిడ్డకు మరో బిడ్డకు మధ్య తేడా (జననాల మధ్య అంతరం) 2005-06, 2015-16 మధ్య హిందూ మహిళల్లో 2.5శాతం పెరిగింది. ముస్లిం మహిళల్లో ఇది 3.75 శాతం పెరిగింది.

**ప్రణాళిక ప్రకారమే..**

ప్రణాళిక లేకుండా.. కనే పిల్లల సంఖ్యను రెండు వర్గాల్లోనూ తగ్గింది. చిన్న వయస్సులో జరిగే వివాహాలు తగ్గటం... వారిలో అవగాహన పెరగటంతో సరైన వయస్సు వచ్చిన తర్వాత పిల్లలను కనేలా ప్రణాళిక వేసుకుని పిల్లలు కంటున్నట్టు గణాంకాలు స్పష్టంచేశాయి. ప్రణాళిక లేని పిల్లలసంఖ్య ముస్లిం మహిళల్లో 50 శాతం తగ్గింది.

ఉదాహరణకు.. 2005-06లో ముస్లిం మహిళల మొత్తం సంతానోత్పత్తి రేటు 3.4 కాగా, వారు కోరుకున్న ప్రణాళిక ప్రకారం కనే సంతానోత్పత్తి రేటు 2.2. ఈ రెండింటి మధ్య వ్యత్యాసం 1.2 మంది పిల్లలు. అంటే, సగటున, ఒక ముస్లిం మహిళ సుమారు 1 ప్రణాళిక లేని బిడ్డకు జన్మనిచ్చింది.ముస్లిం మహిళల్లో ప్రణాళిక లేని పిల్లల సంఖ్య 2015-16లో 0.6కి పడిపోయింది. అంటే 10 ఏండ్లలో 50 శాతం తగ్గింది. అదే కాలంలో, హిందూ మహిళల్లో ప్రణాళిక లేని పిల్లలు 0.29కి అంటే, 42శాతం తగ్గింది.

**జనాభా వృద్ధి రేటుపై ప్రభావం**

మొత్తం జనాభా వృద్ధి రేటుపై క్షీణిస్తున్న సంతానోత్పత్తి రేటు ప్రభావం చూపుతున్నది. 1991లో ముస్లిం సంతానోత్పత్తి రేటు 4.4 కాగా, ముస్లిం జనాభా 32.88 శాతం పెరిగింది (సెన్సస్). 2011లో టిఎఫ్ఆర్ 3.4కు, వారి జనాభా దశాబ్ద వృద్ధి రేటు కూడా 24.6 శాతానికి పడిపోయింది.

**వివాహాలూ వాయిదా**

దేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గటానికి ప్రధానంగా మూడు అంశాలు కారణమని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ స్టడీస్ (ఫెర్టిలిటీ విభాగం) ప్రొఫెసర్ సంజయ్ కుమార్ చెప్పారు. 'మొదటిది స్త్రీల వివాహ వయస్సు పెరగటం. రెండవది గర్భస్రావాలు పెరగటం. మూడవది గర్భనిరోధక మాత్రలు వాడకం. గర్భనిరోధక



మందుల వాడకం జాతీయ స్థాయిలో స్వల్పంగా తగ్గినప్పటికీ, దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఇది పెరిగిందని సంజయ్‌కుమార్ తెలిపారు.

**ముస్లిం కమ్యూనిటీలో సామాజిక మార్పు**

ఇతర కమ్యూనిటీల్లోలాగానే ముస్లిం మహిళల్లోనూ చదువుకున్నవారు పెరుగుతున్నారనీ చరిత్రకారుడు, రచయిత రానా సఫ్వీ అభిప్రాయపడ్డారు. వారు కూడా తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నారనీ, పిల్లలకు మంచి విద్యను అందించేలా చూస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలోనే కుటుంబ నియంత్రణపై వారు ఎక్కువ శ్రద్ధ పెడుతున్నారని అన్నారు. కుటుంబ పరిమాణంపై కొత్త తరం ముస్లిం వైఖరిలో చాలా మార్పు వచ్చిందని సమాజం లోని అట్టడుగు వర్గాలకు విద్యను, శిక్షణ అందించేందుకు సహాయపడుతున్న 'తాలాకి ఐ' అనే స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ ఫర్హీన్ నాజ్ అభిప్రాయపడ్డారు. 'గతంలో నలుగురు లేదా అయిదుగురు పిల్లలను వారు కోరుకునే వారు. కానీ, ఇప్పుడు కేవలం ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలను మాత్రమే కావాలనుకుంటున్నారు. బాలికలకు మంచి విద్య అందించాలన్న దానిపై కూడా ఇప్పుడు వారు దృష్టిపెడుతున్నారు. దీని ఫలితంగా మహిళల్లోనూ అవగాహన పెరిగింది. ఫలితంగా వివాహ వయస్సుతోపాటు, మొదటి బిడ్డకు జన్మనివ్వటం కూడా వాయిదా వేయటానికి ఇది దారితీస్తున్నది' అని నాజ్ తెలిపారు.

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign,we are thankful to the creators.
We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org